ఏడాదిన్నర కిందట అలిపిరి నడక దారిలో మూడు నెలల వ్యవధిలో ఇద్దరు చిన్నారులపై చిరుతలు రాత్రిపూట దాడి చేసిన ఘటన అందరికీ గుర్తుండే వుంటుంది. ఇపుడు ఏకంగా అలిపిరి-చెర్లోపల్లి ప్రధాన రహదారిలో పట్టపగలు ఓ వ్యక్తిపై చిరుత దాడి చేసినంత పని చేసింది. ఎవరి కంటా పడడం ఇష్టపడని జంతువుగా చిరుతకు పేరుంది. అలాంటిది మిట్ట మధ్యాహ్నం పూట అందులోనూ నగరం నుంచీ అడవిలోకి వెళ్ళేందుకు ప్రధాన రహదారి దాటుతూ చిరుత కనిపించడం కలకలం రేపుతోంది. అసలు చిరుత పగటి వేళ శేషాచలం వదిలి అలిపిరి రోడ్డుదాటి మరీ నగరంలోకి ఎందుకు వచ్చింది? అడవి విడిచిపెట్టి వచ్చేంతగా తిరుపతిలో చిరుతలను ఆకర్షిస్తున్నది ఏముంది? అన్న ప్రశ్నలు ఈ సందర్భంగా తలెత్తుతున్నాయి.

చిరుతలు రోడ్డెందుకు దాటుతున్నాయి?



ఎస్వీయూలో ఏర్పాటైన హెచ్చరిక బోర్డులు

జనవరి 3న ఎస్వీయూలో చిరుత సంచారం

- అటవీ ప్రాంతంతో కలగలసిపోయిన వర్శిటీలు
- అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో హోటళ్ళు, హాస్టళ్లు
- వాటినుంచి వచ్చే వ్యర్థాల చుట్టూ చేరుతున్న కుక్కలు, జింకలు, అడవి పందులు
- చిరుతలను ఆకర్షిస్తున్న ఫుడ్ చెయిన్

ఎస్వీయూలో ట్రాప్ కెమెరాలు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

తిరుపతి (విశ్వవిద్యాయాలు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పులి వస్తుంది.. జాగ్రత్త అంటూ ఎస్వీయూలో పలు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటయ్యాయి. ఇటీవల చిరుత సంచారం నేపథ్యంలో విద్యార్థులను, ఉద్యోగులను అప్రమత్తం చేస్తూ ఈ బోర్డులు ఏర్పాటయ్యాయి. సాయంత్రం 6 నుంచీ ఉదయం 6 గంటల వరకూ ఎవరూ యూనివర్సిటీలో సంచరించకూడదంటూ ఇందులో అధికారులు సూచించారు. అయితే, ఈ నెల 3 వ తేదీన యూనివర్సిటీలో చిరుత సంచరించినట్టు ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమరాల్లో రికార్డు అయినట్టు సమాచారం. దీంతో, యూనివర్సిటీలో చిరుత పులి ట్రాప్ బోన్లను కూడా ఏర్పాటు చేయాలని యూనివర్సిటీ అధికారులు ఫారెస్టు అధికారులను కోరారు.పులి సంచారం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు విజ్ఞప్తి చేశారు.

తిరుపతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):ప్రకృతిలో జీవి మనుగడకు ఆధారమైంది ఆహారపు గొలుసు. ఇపుడదే ఆహారపు గొలుసు చిరుతలను శేషాచలం నుంచీ తిరుపతి నగరంలోకి రప్పిస్తోంది. తిరుపతిని శేషాచల అడవుల నుంచీ విడదీసేందుకు ప్రత్యేకంగా ఎలాంటి కంచెలు, ప్రహరీలు లేవు. ఎస్వీ యూనివర్శిటీ మొదలుకుని అనేక విద్యా సంస్థల ఆవరణలు శేషాచల అటవీ ప్రాంతంతో కలసిపోయి వున్నాయి. కేవలం అలిపిరి-చెర్లోపల్లి మెయిన్ రోడ్డు ఒక్కటే వాటిని విడదీస్తోంది. అయితే రాకపోకలను ఆపే సరిహద్దు కాదది. ఒకరకంగా చెప్పాలంటే అడవి నుంచీ జంతువుల రాకపోకలను ఈ రోడ్డు మరింత సులువు చేస్తోంది. ఎస్వీయూ, వేదిక్, వెటర్నరీ వర్శిటీలు, అగ్రికల్చర్ కాలేజీలలో హాస్టళ్ళు వున్నాయి. వాటి ద్వారా రోజువారీ భారీగా వ్యర్థాలు ఆవరణల్లో పోగుపడుతున్నాయి. మరోవైపు అలిపిరి-చెర్లోపల్లి ప్రధాన మార్గం వెంబడీ పలు హోటళ్ళు, కేఫ్‌లు వెలిశాయి. వీటి నుంచీ కూడా పెద్దఎత్తున వ్యర్థాలు పోగు పడుతున్నాయి. ఈ వ్యర్థాల కోసం కుక్కలు, జింకలు, అడవి పందులు యథేచ్ఛగా వస్తున్నాయి. వర్శిటీల ఆవరణల్లో పగలు కూడా జింకలు, అడవి పందులు పెద్ద సంఖ్యలో తిరుగాడుతూ కనిపిస్తున్నాయి. ఇక కుక్కలైతే మందలుమందలుగా తిరుగుతున్నాయి. ఈ మూడింటి కోసం చిరుతలు శేషాచలం నుంచీ రోడ్డు దాటి ఈ వర్శిటీల వైపు వస్తున్నాయి. శేషాచల దిగువ భాగాన వున్న ఎస్వీయూ సహా పలు విద్యా సంస్థల ఆవరణల్లోకి చిరుతలు రావడం కొత్త కాదు. పై జంతువుల కోసం రెండు దశాబ్దాలుగా చిరుతల రాకపోకలు సాగుతున్నాయి. అయితే గతంలో ఎప్పుడూ రాత్రిళ్ళు మాత్రమే ఎవరి కంటా పడకుండా అడవి దాటి వర్శిటీల ఆవరణల్లోకి వచ్చే చిరుతలు ఇపుడు ఏకంగా పగలే చొరబడుతున్నాయి. అలిపిరి నడక దారిలో చిన్నారులపై దాడి జరిగినట్టు వర్శిటీల ఆవరణల్లోనూ, అలిపిరి-చెర్లోపల్లి రోడ్డులోనూ ఇప్పటి దాకా ఎలాంటి ఘటనలూ నమోదు కాలేదు కానీ ఇకమీదట జరగబోవన్న గ్యారంటీ ఏమీ లేదు.ఇప్పటికే అటవీ శాఖ అధికారులు అమర్చిన కెమెరా ట్రాపుల్లో చిరుతల రాకపోకలు, కుక్కలను నోటకరుచుకుని వెళుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి.విద్యార్థులు కూడా తమ మొబైళ్ళలో చిరుతల కదలికలను చిత్రీకరించిన ఉదంతాలున్నాయి.

తక్షణ చర్యలు తీసుకోకుంటే ప్రమాదమే!

శేషాచల అడవుల్లో చిరుతలు సుమారు 50కి పైగా వుంటాయని అంచనా. అడవిలో వాటి సంఖ్య పెరిగే కొద్దీ సులువుగా దొరికే ఆహారం కోసం అడవి దాటి బయటకు రావడం కూడా పెరుగుతోంది. అడవిలో అయితే జింకలు, అడవిపందులు వంటి వాటిని వెంటాడి వేటాడాలి. అదే అలిపిరి-చెర్లోపల్లి రోడ్డు దాటి దక్షిణానికి వస్తే విద్యాసంస్థల ఆవరణల్లో కుక్కలు, జింకలు, అడవిపందులు సులువుగా దొరికే అవకాశముంది. అందుకే ఈ వైపు చిరుతల కదలికలు క్రమేపీ పెరుగుతున్నాయి. అలిపిరి-చెర్లోపల్లి రోడ్డు వెంబడీ హోటళ్ళు, కేఫ్‌లకు అనుమతి రద్దు చేయడం, లేదా కనీసం వారు వ్యర్థాలను దూరంగా పారబోసేలా చర్యలు తీసుకోవాల్సివుంది. వర్శిటీల హాస్టళ్ళ నుంచీ వచ్చే వ్యర్థాలు ఆవరణలో పడేయకుండా చూడాలి. వర్శిటీల ఆవరణల్లో రోజూ ఉదయం, సాయంత్రం వాకింగ్ కోసం వచ్చే వారు కూడా వ్యర్థాలు పడేస్తున్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా కుక్కలకు పెడుతున్నారు. దీంతో కుక్కల సంఖ్య పెరుగుతోంది. వ్యర్థాలు ఆవరణలో పడేయకుండా నివారిస్తే చిరుతల రాకపోక లు కూడా ఆగిపోతాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. చిరుతలు మనుషులపై దాడి చేసే వరకూ ఆగకుండా ఆ దిశగా చర్యలు తక్షణావసరం.

నేడు తిరుచానూరుకు సీఎం చంద్రబాబు

- ఇళ్లకు పైప్ ద్వారా నేచురల్ గ్యాస్ సరఫరా ప్రారంభం

తిరుపతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు జిల్లాకు రానున్నారు. ఏజీ అండ్ పి కంపెనీకి సంబంధించి తిరుచానూరులో ఇళ్ళకు పైప్‌లైన్ ద్వారా నేచురల్ గ్యాస్ సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.ఏజీ అండ్ పీ కంపెనీగా పిలిచే అట్లాంటిక్ గల్ఫ్ అండ్ పసిఫిక్ కంపెనీ తిరుచానూరు ప్రాంతంలో ఏడాదిగా ఇళ్ళకు వంట గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసే ప్రాజెక్టును చేపట్టింది. ఇప్పటి వరకూ వంట గ్యాస్ లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) రూపంలో సిలిండర్ల ద్వారా పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇపుడు ఏజీ అండ్ పీ కంపెనీ నేచురల్ గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా నేరుగా ఇళ్లకు సరఫరా చేయనుంది. ఇప్పటి వరకూ సుమారు 2 వేల ఇళ్ళకు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆ క్రమంలో ఆదివారం ముఖ్యమంత్రి సంబంధిత కంపెనీ ఆహ్వానం మేరకు తిరుచానూరు పంచాయతీ పరిధిలో బనియన్ ఫ్యాక్టరీ సమీపంలోని శరవణ అనే వ్యక్తికి చెందిన ఇంటిని సందర్శించి గ్యాస్ సరఫరాను ప్రారంభించనున్నారు.అనంతరం హోటల్ తాజ్‌కు చేరుకుని అక్కడ ఏజీ అండ్ పీ కంపెనీ పరిశ్రమలకు నేచురల్ గ్యాస్ సరఫరా ప్రాజెక్టును ప్రారంభిస్తారు. అలాగే అదే సంస్థకు సంబంధించిన సీఎన్‌జీతో నడిచే ద్విచక్ర, మూడు చక్రాల, నాలుగు చక్రాల వాహనాలను, ఎల్‌సీవీలను జెండా ఊపి ప్రారంభిస్తారు.ఆపై అక్కడే కంపెనీ ప్రతినిధులతోనూ, అందులో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న జపాన్ ప్రతినిధుల బృందంతోనూ సమావేశమవుతారు.



గ్యాస్ సరఫరాకు సంబంధించి ఓ ఇంటి వద్ద అమర్చిన మీటరు

15 వరకూ స్వగ్రామంలోనే సీఎం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం సాయంత్రం స్వగ్రామమైన నారావారిపల్లి చేరుకుంటారు. శనివారమే ఆయన సతీమణి నారా భువనేశ్వరి స్వగ్రామం చేరుకుని పలు అభివృద్ధి పనులు పరిశీలించడం, ప్రారంభించడం చేశారు. వీరితో పాటు నందమూరి కుటుంబానికి చెందిన పలువురు కూడా వచ్చే అవకాశముంది.ఆదివారం రాత్రి నుంచీ బుధవారం ఉదయం దాకా వీరంతా గ్రామంలోనే గడపనున్నారు. బుధవారం మధ్యాహ్నం చంద్రబాబు విజయవాడ తిరుగు ప్రయాణమవుతారు. కాగా సీఎం చంద్రబాబు నాలుగు రోజుల పాటు జిల్లాలో వుండనున్న నేపథ్యంలో యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. కలెక్టర్ వెంకటేశ్వర్, ఇంఛార్జి ఎస్పీ మణికంఠ, మున్సిపల్ కమిషనర్ మౌర్య తదితరులు సీఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పక్షుల పండుగపై సందిగ్ధత

- మరో ఐదు రోజుల్లో వేడుక
- ఇప్పటికీ మొదలుకాని పనులు

తడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పులికాట్ వేదికగా మరో వారం రోజుల్లో ప్రారంభం కావాల్సిన ఫ్లెమింగ్ ఫెస్టివల్ నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. గత వైసీపీ హయాంలో ఆపేసిన పక్షుల పండుగను అట్టహాసంగా నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చేలా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కృషి చేశారు. మొదట జనవరి 10, 11, 12తేదీల్లో ఫ్లెమింగ్ ఫెస్టివల్ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అయితే సమయం తక్కువగా ఉండటంతో 17, 18, 19 తేదీలకు మార్చారు.అదే సమయంలో నాయుడుపేటలో ఏటి పండుగ నిర్వహిస్తుండటంతో 18, 19, 20 తేదీల్లో పక్షుల పండుగ నిర్వహించాలని భావించారు.సూళ్లూరుపేటలో గత మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పండుగ కమిటీని ప్రకటించి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా ఫ్లెమింగ్ ఫెస్టివల్ నిర్వహణకు మరో వారం రోజులు మాత్రమే ఉండగా ఇప్పటివరకు ఎటువంటి పనులు ప్రారంభంకాలేదు. పండుగ కమిటీ కూడా ఏర్పాట్లకు చొరవచూపడం లేదు. ఈ నేపథ్యంలో పక్షుల పండుగ జరుగుతుందా అన్న అనుమానం జనాల్లో నెలకొంది.

ముగ్గురు తహసీల్దార్లకు పదోన్నతి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్లకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పోస్టింగ్స్ కేటాయించారు. అందులో భాగంగా జిల్లాలో అత్యంత కీలకమైన ప్రోటోకాల్ -1, ప్రోటోకాల్-2, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులు భర్తీ చేసింది. ప్రోటోకాల్-1 ఎస్‌డీసీగా శివశంకర్‌నాయక్, ప్రోటోకాల్-2 ఎస్‌డీసీగా సువర్ణమ్మ నియమితులయ్యారు. అలాగే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఐసీసీ) తిరుపతి జోనల్ మేనేజరుగా విజయభారత్‌రెడ్డిని నియమించారు.

ఇన్‌చార్జి ఎస్పీగా మణికంఠ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా మణికంఠ శనివారం తిరుపతి ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా ఎస్పీగా పని చేస్తున్న ఈయన్ను తిరుపతి జిల్లాకు ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్పీగా పనిచేసిన సుబ్బరాయుడును ప్రభుత్వం హెడ్ క్వార్టర్‌కు బదిలీ చేసిన విషయం విదితమే. మణికంఠ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎల్లమ్మ ఉత్సవాల పోస్టరు ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాని, తదితరులు

తిరుచానూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ తల్లి మహోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే పులివర్తి నానితదితరులు ఆవిష్కరించారు. వేడుకలను వైభవంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆలయ ఈవో, ఉత్సవ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే పులివర్తి నాని సూచించారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ నేత గౌస్‌బాషా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ శ్రీనివాసులు

చంద్రగిరి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కెఎంఎం కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంప్రదాయం, సంస్కృతిని తలపిచేలా కార్యక్రమాలను నిర్వహించారు. రంగురంగుల రంగోలీలు, ఫుడ్ స్టాల్స్ వివిధ ఆట పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. భోగి మంటలతో క్యాంపస్ పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకలను కళాశాల చైర్మన్ శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సాకే త్రిపుర, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

90 గోకులాల నిర్మాణం పూర్తి: ఏపీవో



బోడేవాండ్లపల్లెలో గోకులాన్ని ప్రారంభిస్తున్న ఏపీవో

ఎర్రావారిపాలెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బోడేవాండ్లపల్లెలో గోకులాన్ని ఉపాధి హామీ ఏపీవో మహేష్, టీడీపీ నాయకులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 150 గోకులాలు మంజూరు కాగా 90 నిర్మాణాలు పూర్తయ్యామన్నారు. 60 నిర్మాణదశలో ఉన్నాయన్నారు. మినీ గోకులాలను పశుసంవర్ధక శాఖ, ఉపాధిహామీ సంయుక్తంగా నిర్మిస్తున్నాయన్నారు. కూరపర్తివారిపల్లెలో కూడా గోకులం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాల్లో డాక్టర్ కృష్ణకాంత్, టీడీపీ నాయకులు మధు, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, సర్పంచ్ జయమ్మ,మహేష్‌నాయుడు,వెంకటేశ్వరరెడ్డి,శ్రీధర్‌బాబు, రాజశేఖర్ నాయుడు, రెడ్డిబాబు, వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రామచంద్రాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తాయని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఫర్ అకడమిక్స్ ప్రొఫెసర్ లక్ష్మయ్య అన్నారు. వెంకట్రామపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో శనివారం కళాశాల, కోకకోలా ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంయుక్తంగా సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి సంస్కృతి సంప్రదాయాలు పాత తరానికే కాకుండా నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రంగోలి, ఫుడ్ కార్నివాల్, మెహందీ, ఫోక్ డ్యాన్స్, సేక్ రేస్ వంటి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ శరవణకుమార్, కోకకోలా ప్రతినిధులు సుబ్బనరసయ్య, గౌరీ శంకర్, హేమమహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు

భాకరాపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు జనార్దన్ రాజు తెలిపారు. తిప్పిరెడ్డిగారిపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నెం.780లో 101.27 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో గ్రామానికి చెందిన కొందరు కొంతభూమిని ఆక్రమించుకునేందుకు చదును చేస్తుండగా టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ పార్టీ శ్రేణులతో కలిసి చేరుకుని పరిశీలించారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

సీఆర్ రాజన్‌కు నేతల శుభాకాంక్షలు



రాజన్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న పులివర్తి నాని

తిరుచానూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. రూరల్ మండల పరిధిలోని తిరుచానూరులోని సీఆర్ రాజన్ స్వగృహంలో ఎమ్మెల్యే పులివర్తి నాని కలిసి దుశ్శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, అమిలినేని మధు,మధుశేఖర్ ,కిషోర్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయులకు,కార్యకర్తలు.భారతీయ జనతా పార్టీ నేతలు తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

సంక్రాంతి పుస్తకాల పండుగకు విశేష స్పందన

● నేటితో ముగియనున్న ప్రదర్శన



పుస్తకాలను పరిశీలిస్తున్న పాఠకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సంక్రాంతి పుస్తకాల పండుగకు విశేష స్పందన లభిస్తోంది. తిరుపతి బాలాజీకాలనీలో గల ఎస్వీ హైస్కూల్ మైదానం ఎదురుగా శనివారం సాయంత్రం 4 నుంచీ 8 గంటల వరకూ పుస్తకాల పండుగ ప్రారంభమైంది. రెండు రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో భాగంగా తొలి రోజైన శనివారం రూ.20వేల విలువచేసే పుస్తకాలు అమ్ముడు పోవడం గమనార్హం. సగం ధరకే ఎన్నో విలువైన కథలు, నవలలు, నాటకాలు, పాటలు, పద్యాలు, జీవిత చరిత్రలు వంటి పుస్తకాలను అమ్మకానికి ఉంచారు. ఈ కార్యక్రమాన్ని శ్వేత మాజీ సంచాలకులు భూమన్ ప్రారంభించి.. ఇది మంచి ప్రయత్నమని అభినందించారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం (తిరసం) అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధర ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ సంక్రాంతి పుస్తకాల పండుగను తిరుపతిలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తెలుగు భాషా, సాహిత్యాభిమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారంతో పుస్తక ప్రదర్శన ముగుస్తుందన్నారు. సమాచారం కోసం.. 92961 05909 నెంబరులో సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పుస్తక ప్రియులు యువశ్రీ మురళి, నాగలూరి దయాకర్, పేరూరు బాలసుబ్రమణ్యం, నెమిలేటి కిట్టన్న, వెంకటాచలపతి, తమటం రామచంద్రారెడ్డి, పత్తిపాటి వివేక్, సుబ్బారావు, ఆకుల మల్లేశ్వరరావు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఆప్కాస్, వర్క్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు చేస్తున్న పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన భవన్‌లో శనివారం కార్మిక సంఘాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబరు 2ను సవరించి అందరికీ ఎంటీఎస్ అమలు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలక ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరించేవిధంగా వ్యవహరించరాదన్నారు. సమావేశంలో నాయకులు జి.నాగవెంకటేష్, ఎస్.జయచంద్ర, జి.చిన్నబాబు, కె.వేణుగోపాల్, చెంగల్రాయులు, లోకేష్, రాజేంద్ర, గంగయ్య, అలీ, చంద్రమ్మ, మునిలక్ష్మి పాల్గొని ప్రసంగించారు.

వేద పరిరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు



బీఆర్ నాయుడికి విరాళం చెక్కు అందజేస్తున్న జనార్దన్

తిరుమల, జనవరి11(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన సాయి రాఘవేంద్ర నిర్మాణం సంస్థ చైర్మన్ జనార్దన్ అనే భక్తులు ఈ విరాళాన్ని అందజేశారు. విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడికి దాత అందజేశారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



ఓబన్నకు పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, వడ్డే ఓబన్న జయంతి వేడుకలను శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. 20 సూత్రాల ప్రోగ్రామ్ ఛైర్‌పర్సన్ లంకా దినకర్, కలెక్టర్ వెంకటేశ్వర్‌లు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌కు గాయాలు

పాకాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో పాకాల-నేంద్రగుంట రోడ్డు శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పేరసానిపల్లె పంచాయతీ గుండ్లగుట్టపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ రామచంద్రయ్య మరో వ్యక్తితో కలిసి పాకాల వైపు మోటారు సైకిల్‌పై వస్తున్నారు. ఉన్నతపాఠశాల సమీపంలో దామలచెరువు వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో రామచంద్రయ్య చేతికి, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. పాకాల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్సకోసం అంబులెన్స్‌లో తిరుపతికి తీసుకెళ్లారు.

ఈ కారెవరిదో..?



పాకాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) రైల్వే గేటు సమీపం ఫకీరుపేట మార్గంలో రోడ్డు పక్కన మూడురోజులుగా పార్కుచేసిన కారు అనుమానాస్పదంగా వుంది. గురువారం సాయంత్రం ఓ యువకుడు వేగంగా కారులో వచ్చి ఫకీరుపేట వైపు వెళ్లి అటు దారిలేదని మళ్లీ రివర్స్ వచ్చి చింతచెట్టు సమీపంలో రోడ్డు పక్కన కారు పార్కు చేశాడు. తర్వాత బరువైన బ్యాగుతో పట్టాలు దాటి వెళ్లినట్టు తెలిసింది. అప్పటి నుంచి హెచ్‌ఆర్ 22ఎస్7032 నంబరు గల తెలుపు రంగు కారు అక్కడే వుంది. మూడురోజులు దీని గురించి చర్చించుకుంటున్నారు.

రేణిగుంటలో రైల్వే పీసీఎస్‌వో తనిఖీలు

తిరుపతి(సెంట్రల్), జనవరి 11(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్‌లో శనివారం దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కె.వెంకటరమణారెడ్డి తనిఖీలు నిర్వహించారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా సికింద్రాబాదు నుంచి రేణిగుంటకు చేరుకున్న ఆయన డ్రైవర్ల విధుల కేటాయింపు క్రూ విభాగం, లాబీ విభాగాన్ని పరిశీలించారు. సీనియర్ స్కేల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చక్రస్నాన వేడుకలు



చక్రత్తాళ్వారును పుష్కరణిలో మునక వేయిస్తున్న అర్చకులు

తిరుచానూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వాదశిని పురస్కరించుకుని శనివారం ఉదయం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ఆలయం నుంచి చక్రత్తాళ్వార్లను వేంచేపుగా పద్మ సరోవరంలోని(అమ్మవారి పుష్కరిణి) పంచమి తీర్థం మండపంలో కొలువుదీర్చారు. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా చక్రత్తాళ్వార్‌ను అమ్మవారి పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు మునక వేయించారు. అశేష భక్తజనం పుణ్యస్నానాలు ఆచరించారు. దీంతో అమ్మవారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ముగిశాయి.

కల్యాణ వెంకన్న ఆలయంలో..

చంద్రగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం చక్రస్నానాన్ని వైభవంగా నిర్వహించారు. దీంతో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి ఉత్సవాలు సందర్భంగా ఆలయంలో ఉదయం మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన, మొదటి గంట, బలి, శాతుమొర సేవలు నిర్వహించి, దనుర్మాసం కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం, వైకుంఠ ద్వార ప్రవేశం కల్పించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు శ్రీవారి ఆయుధమైన చక్ర తాళ్వార్‌ని పుష్ప పల్లకిలో ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. పలకిని పుష్కరణి దగ్గరకు తీసుకొచ్చి ప్రత్యేక వేదికపై కొలువు దీర్చి వేద మంత్రోచ్చారణ నడుమ పాలు. పెరుగు, తేనె, లేత కొబ్బరి నీరు, గంధం తదితర ద్రవ్యాలతో చక్రతాళ్వార్‌కి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం జరిపారు. పుష్కరణిలో గోవింద నామ స్మరణలతో చక్ర తాళ్వారేకి చక్రస్నానాన్ని నిర్వహించారు. చక్రతాళ్వార్‌తో పాటు భక్తులు స్నానాన్ని ఆచరించారు.



శ్రీనివాసమంగాపురంలో చక్రస్నాన ఘట్టం

నారావారిపల్లెలో సందడే సందడి

● ఇప్పటికే చేరుకున్న నారా భువనేశ్వరి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చంద్రగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శనివారం మధ్యాహ్నం నారావారిపల్లెకు చేరుకున్నారు. ఆదివారం రాత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్, ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ, భార్య వసుంధర రానున్నారు. నారా, నందమూరి కుటుంబాలు ఏటా సంక్రాంతికి చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లెకు రావడం ఆనవాయితీ. ఈ క్రమంలో గ్రామం రెండు రోజులు ముందుగానే సంక్రాంతి శోభను సంతరించుకుంది. తెలుగు తమ్ముళ్లు పండుగ ఏర్పాట్లు చేస్తున్నారు. చంద్రబాబు ఇంటి వద్ద, తల్లితండ్రుల సమాధుల వద్ద, కులదైవం నాగాలమ్మ ఆలయం, గ్రామ దేవతల వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. ఎన్టీఆర్, ఆయన సతీమణి బసవతారకం విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకులను దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏటీఎంను ప్రారంభించిన భువనేశ్వరి

నారావారిపల్లె ప్రజల సౌకర్యార్థం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంను నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఏటీఎం ద్వారా నగదు లావాదేవీలు నిర్వహించారు.



ఏటీఎంను ప్రారంభించిన నారా భువనేశ్వరి

కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, డీపీవో సుశీలాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

నారావారిపల్లె శనివారం రాత్రి కలెక్టర్ డాక్టర్ వేంకంటేశ్వర్, ఎస్పీ మణికంఠ ఏర్పాట్లును పరిశీలించారు. కలెక్టర్, డీపీవో సుశీలాదేవిని, ఇతర అధికారులతో మాట్లాడారు. బందోబస్తు, సిబ్బంది పర్యవేక్షణపై ఆరా తీశారు.

కుటుంబ కలహాలకు ఇద్దరు చిన్నారుల బలి

● పిల్లలతో కలసి బావిలో దూకిన తల్లి
● తల్లిన కాపాడగలిగిన గ్రామస్తులు



చిన్నారుల మృతదేహాలు

నగరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలకు ఇద్దరు చిన్నారుల జీవితాలు బలైపోయాయి. ఆవేశంలో పిల్లల కన్నతల్లి తీసుకున్న నిర్ణయం రెండు కుటుంబాల్లో శాశ్వత విషాదాన్ని నింపింది.పోలీసుల కథనం మేరకు... నగరి మున్సిపాలిటీ పరిధిలోని భీమానగర్‌కు చెందిన దేవి (33)కి, చెన్నైలోని వెస్ట్ మాంబళానికి చెందిన ధనంజయులుతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఐశ్వర్య (10), అక్షర (3) అనే ఇద్దరు అమ్మాయిలు పుట్టారు.కుటుంబ కలహాల కారణంగా గురువారం దేవి నగరిలోని పుట్టింటికి వచ్చేసింది. శుక్రవారం ఏకాంబరకుప్పం సమీపంలో వున్న సాళ్వపట్టెడలోని పెదనాన్న ఇంటికి వెళ్లి వస్తానని దేవి ఇద్దరు పిల్లలను తీసుకువెళ్లింది. అయితే ఆమె తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు సాళ్వపట్టెడలోని బంధువులను విచారించారు.జాడ తెలియకపోవడంతో పోలీసులకు శనివారం ఉదయం ఫిర్యాదు చేశారు. సాయంత్రం సాళ్వపట్టెడ సమీపంలోని పొలాల నుంచి ఆవులు తోలుకు వస్తున్న వ్యక్తులకు అక్కడున్న బావినుంచి శబ్దాలు వినిపించాయి.బావి దగ్గరకు వెళ్లి చూడగా తాడుపట్టుకొని వేలాడుతున్న దేవి కన్పించింది.వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను పైకిలాగి ఆస్పత్రికి తరలించారు. రాత్రి చిన్నారుల మృతదేహాలను బావి నుంచి బయటకు తీశారు.

అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

● తెలంగాణ బీజేపీ ఎంపీ లక్ష్మణ్



తిరుమల, జనవరి11(ఆంధ్రజ్యోతి): తిరుపతితో తొక్కిసలాట సంఘటన దురదృష్టకరమని తెలంగాణ బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. విశేష పర్వదినాల్లో వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైకుంఠద్వాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుపతి ఘటనపై న్యాయవిచారణకు ఆదేశించడం మంచి విషయమన్నారు. నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం, టీటీడీ బోర్డు, అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

వైసీపీ నేతలు శవ రాజకీయాలు మానుకోవాలి



మాట్లాడుతున్న మమత తదితరులు

తిరుపతి రూరల్/తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ద్వార టోకెన్ల జారీలో జరిగిన దుర్ఘటనపై మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు శవ రాజకీయాలు చేయడం నీతిమాలిన చర్య అని ఎంఆర్ పల్లెకి చెందిన టీడీపీ మహిళా నేత, మాజీ సర్పంచ్ బి.మమత పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రజాపాలనని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు ఆయనపై పసలేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏపీలో ఎన్నో సంఘటలను జరిగాయని, అప్పట్లో సీఎంగా ఉన్న జగన్ ఏరోజైనా బాధితులను పరామర్శించిన పాపానపోలేదని విమర్శించారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు తమ వైఖరిని మార్చుకోకపోతే ప్రజాకోర్టులో భంగపాటు తప్పదని హెచ్చరించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ట్రెజరీ అండ్ అకౌంట్స్ జిల్లా అధ్యక్షుడిగా కుప్పుస్వామి



తిరుపతి(జీవకోన), జనవరి 11(ఆంధ్రజ్యోతి): ట్రెజరీ అండ్ అకౌంట్స్(ఏపీ టీఏఎస్ఏ) కార్యాలయం తిరుపతి యూనిట్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడిగా పి.కుప్పుస్వామి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.శ్రీనివాసులు,కార్యదర్శిగా కె.ఎం.మధుబాబు, కోశాధికారిగా కె.ఈశ్వరయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.మోహన్‌కుమార్ ఎంపికయ్యారు. మరో ముగ్గురు చొప్పున ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు ఎంపికయ్యారు.

అలరించిన శోభారాజ్ గాత్ర కచేరి

తిరుమల, జనవరి11(ఆంధ్రజ్యోతి):తిరుమల శ్రీవారి సహస్రదీపాలంకార సేవలో ప్రముఖ గాయని శోభారాజ్ గాత్ర కచేరి భక్తులను అలరించింది. తిరుమల శ్రీవారి ఆలయం ముందున్న శనివారం సాయంత్రం జరిగిన సహస్రదీపాలంకార సేవలో శోభారాజ్ తన శిష్యబృందంతో కలిసి గాత్ర కచేరి నిర్వహించారు. ఈసందర్భంగా 'కొలని దోపరికి, వాడే వేంకటేశుడనే వాడె వీడు..' అనే కీర్తలను మధురంగా అలపించారు. స్వరార్చనతో ఆకట్టుకున్నారు.







విష్ణునివాసం వద్ద స్లాటెడ్ సర్వదర్శన కోసం వేచి ఉన్న భక్తులు- తర్వాత క్యూలైన్లలో వెళుతున్న భక్తులు

మళ్లీ మొదలైన వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీ

● ప్రకటన కంటే ముందుగానే పకడ్బందీగా ప్రారంభించిన టీటీడీ

తిరుపతి/తిరుపతి(విద్య)/తిరుపతి(నేరవిభాగం), జనవరి11(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వైకుంఠద్వార దర్శనానికి సంబంధించిన స్లాటెడ్ సర్వదర్శన(ఎస్ఎస్‌డీ) టోకెన్ల జారీని టీటీడీ తిరిగి ప్రారంభించింది. తొక్కిసలాట నేపథ్యంలో ప్రకటించిన తేదీ కంటే ముందుగానే టోకెన్ల జారీని టీటీడీ మొదలుపెట్టాల్సి వచ్చింది. 13 నుంచి 19వరకు ఏరోజుకు ఆరోజు జారీ చేస్తామని టీటీడీ ప్రకటించింది. ఈ క్రమంలో టోకెన్ల కోసం భక్తులు శ్రీనివాసం, విష్ణునివాసం వద్ద క్యూలైన్లలోకి శనివారం ఉదయం నుంచే రావడం మొదలుపెట్టారు. రాత్రి సమయానికి శ్రీనివాసం, విష్ణునివాసంతో పాటు అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద క్యూలైన్లలో బారులు తీరారు. టీటీడీ సీవీఎస్వో శ్రీధర్, అదనపు ఎస్పీ వెంకట్రావు కట్టుదిట్టమైన భద్రత నడుమ టోకెన్ల జారీ ప్రక్రియను రాత్రి 10 గంటల నుంచే మొదలుపెట్టారు. తోపులాటలు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. విష్ణునివాసంలోని కౌంటర్ వద్దకు వెళ్లేందుకు కొంతమంది పోటీపడిన క్రమంలో ప్రవేశమార్గంలో కొద్దిసమయం హడావుడి నెలకొంది. తర్వాత భద్రతా సిబ్బంది ఒక్కొక్కరిగా క్యూలైన్‌లోకి అనుమతించారు. రద్దీని బట్టి మళ్లీ రామచంద్ర పుష్కరిణి వద్ద టోకెన్లు ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెప్పారు. 13వ తేదీకి సంబంధించి దాదాపు 45 వేల టోకెన్లు జారీ చేయాలని భావిస్తున్నారు. భూదేవి కాంప్లెక్స్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్,జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ,టీటీడీ జేఈవో వీరబ్రహ్మం,టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి శనివారం రాత్రి పరిశీలించారు.

జాతీయ యువజనోత్సవాల్లో విజేతగా తిరుపతి బృందం



విజేత ఎస్వీ సంగీత నృత్య కళాశాలకు చెందిన శ్రీధర జానపద పాటల బృందంతో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

తిరుపతి అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ యువజనోత్సవాల్లో స్థానిక ఎస్వీ సంగీత, నృత్య కళాశాలకు చెందిన శ్రీధర్ జానపద పాటల బృందం విజేతగా నిలిచింది. సెట్విన్ ఆధ్వర్యంలో గత ఏడాది సెప్టెంబరులో స్థానిక ఎస్వీ సంగీత నృత్య కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయికి పంపారు. ఆ తరువాత గతవారం విజయవాడ వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించిన తిరుపతి శ్రీధర్ జానపద పాటల బృందాన్ని జాతీయస్థాయికి ఎంపిక చేశారు. ఈ క్రమంలో శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన జాతీయ యువజనోత్సవాల్లో కూడా శ్రీధర్ బృందం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు కళాకారులను అభినందించినట్లు సెట్విన్ సీఈవో కె.మోహన్‌కుమార్ తెలిపారు. ఆదివారం వివేకానంద జయంతి సందర్భంగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. వీరికి రవాణా, వసతి, భోజన సదుపాయాలు సెట్విన్ విభాగమే భరించినట్లు ఆయన తెలిపారు. తిరుపతి కళాకారులు జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహించడంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రోత్సాహం ఉందని, ఆరేళ్ల తరువాత ఈ ఘనత సాధించడం అభినందనీయమన్నారు.

ఘనంగా సీఆర్ రాజన్ జన్మదిన వేడుకలు



తిరుచానూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వన్నియకుల క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ చిత్తూరుజిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. శనివారం తిరుచానూరులోని ఆయన స్వగృహంలో టీడీపీ నేత దామినేడు రమేష్ ఆధ్వర్యంలో సుమారు 80 కిలోల కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం సీఆర్ రాజన్ దంపతులను గజమాలతో సత్కరించి చిత్రపటాన్ని బహూకరించారు. అంతకుముందు పలువురు రాజకీయ నాయకులు, అభిమానులు ఆయన్ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

చిరుత కదలికలపై జాగ్రత్తలు తీసుకుంటున్నాం

మంగళం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చిరుత దాడికి ప్రయత్నించడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న టీటీడీ ఉద్యోగి మునికుమార్ కిందపడి గాయాలపాలైన నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.చెర్లోపల్లి రోడ్డులోని వేదిక్ వర్సిటీ వద్ద చెట్టుపై నుంచి చిరుత ఒక్కసారిగా కిందకు దూకడంతో భయపడిన మునికుమార్ వాహనం నుంచి కిందపడ్డాడు. ఈ నేపథ్యంలో చెర్లోపల్లిరోడ్డులో సాయంత్రం 6నుంచి ఉదయం 6గంటల వరకు ఎవరూ తిరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. చిరుత వేద విశ్వవిద్యాలయం నుంచి శేషాచల కొండల్లోకి వెళ్లే సమయంలో ఈ సంఘటన జరిగిందని అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. చిరుత సంచరించే మార్గంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా సిబ్బందికి నైట్ డ్యూటీలు వేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారు బోను ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు.చిరుతలను ఎవరైనా గమనించినట్లయితే వెంటనే అటవీ శాఖ ఎఫ్‌బీవో 9440090809, ఎఫ్ఎస్‌వో 9492549171, ఎఫ్ఆర్‌వో 9440810303 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారమందించాలని కోరారు.

దుష్టశక్తులపై ఉక్కుపాదం మోపిన ఎస్పీని కొనసాగించాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి దర్శన టోకెన్ క్యూలైన్ల వద్ద జరిగిన ఘటనలో బాధ్యులుగా తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడును చూపుతూ సీఎం చంద్రబాబు బదిలీ చేయడం బాధాకరమని, వెంటనే బదిలీని రద్దు చేసి కొనసాగించాలని సనాతన పరిరక్షణ సమితి నాయకులు, జెన్ అకాడమి అధ్యక్షుడు కిరణ్‌కుమార్ కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వెంటనే ఎస్పీ, డీఎస్పీ రమణకుమార్ బదిలీలను నిలుపుదల చేసి తిరుపతి జిల్లాలోనే కొనసాగించాలన్నారు. సురేష్, గోపాల్, శ్యామల, సుకుమార్, వాసు తదితరులు పాల్గొన్నారు. మరో సమావేశంలో ఎస్పీ బదిలీని రద్దు చేయాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ వ్యవస్థాపకులు రెడ్డి శేఖర్ రాయల్ అభ్యర్థించారు. సుందరం, రత్నశేఖర్, సావిత్రమ్మ పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల పేరుతో వందల కోట్ల కుంభకోణం

- బోగస్ ఓట్ల సూత్రధారులను గుర్తించండి
- 20సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్



సమావేశంలో మాట్లాడుతున్న దినకర్, పక్కన కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గడచిన ఐదేళ్లలో టీడీఆర్ బాండ్ల పేరుతో రూ.వందల కోట్ల కుంభకోణం జరిగిందని, దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని 20సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం కేంద్ర పథకాలు, ప్రాజెక్టుల పురోగతి, తిరుమల భక్తులకు మౌలిక సదుపాయాలు, స్మార్ట్‌సిటీ అభివృద్ధిపై ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో తిరుపతి నగర పాలకసంస్థ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై లోతుగా అధ్యయనం చేసి, సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. బోగస్ ఓట్ల వ్యవహారంలో అమాయకులను బలిచేయడం సరికాదన్నారు. సూత్రధారులను గుర్తించాలని కోరారు. కొరమీను గుంట, పూలవాని గుంట ఆక్రమణలపై న్యాయస్థానాల ఉత్తర్వులు ఎందుకు అమలు కావడంలేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంలో అవకతవకలపై ఆరా తీశారు. జలమిషన్ పథకాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. పీఎంఏవై కింద జిల్లాలో కేటాయించిన గృహాల నిర్మాణాలను పూర్తి చేసి, మౌలిక వసతులు కల్పించాలన్నారు. శ్రీకాళహస్తి, పుత్తూరు, వెంకటగిరిలలో అమృత్ పథకం పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సూర్యఘర్ పథకం అమలులో వేగం పెంచి, లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలుచేసి, వందశాతం ఫలితాలు సాధించాలన్నారు. సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, టీటీడీ బోర్డు మెంబరు భానుప్రకాష్‌రెడ్డి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

తిరుపతి(ఆటోనగర్), జనవరి 11: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. తిరుచానూరు సమీపంలో శనివారం ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో రాష్ట్ర మహాసభలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో సంఘం ఏర్పాటు చేసినప్పటి నుంచి వెనుకబడిన తరగతులకు చెందిన ఉద్యోగులు శాఖా పరమైన సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. పదోన్నతుల సమస్యతోపాటు, బకాయిలు చెల్లించే అంశాలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ సంస్థలో ఉన్న ఖాళీలు భర్తీ చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ట్రాన్స్‌కో, డిస్కంల సీఎండీలను కలసి చర్చించి సమస్యల పరిష్కరిస్తానని వెల్లడించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి కూడా ప్రయత్నిస్తామన్నారు. అనంతరం విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ, కాలమాన పట్టికను ఆవిష్కరించారు. రాష్ట్ర నాయకులు జీకే వీరభద్రయ్య, ఎం.రామకృష్ణ, ఎం.శ్రీధర్, జి.చిన్నబాబు, పి.వి.మురళీమోహన్, ఎల్.చలపతి, కె.గంగాధర్‌రావు, ఎస్.రామకృష్ణ, జె.రామారావు, జి.విశ్వరూపాచారి, ఎం.పూర్ణచంద్రరావు, జె.శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.45 కోట్లు

తిరుమల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.45 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించింది. రూ.2.45 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది.

గాయపడిన బాధితురాలిని ఆదుకుంటాం

- టీటీడీ బోర్డు సభ్యులు



రాజేశ్వరిని పరామర్శిస్తున్న భానుప్రకాష్‌రెడ్డి, సుచిత్ర ఎల్ల

తిరుపతి(వైద్యం), జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న విష్ణు నివాసంలో వైకుంఠం ద్వార దర్శన టోకెన్ల సమంలో అక్కడే విధులు ముగించుకొని బయటకు వస్తూ అంబులెన్సు ఢీకొని గాయపడిన రాజేశ్వరికి టీటీడీ అన్ని విధాలా అండగా ఉంటుందని టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సుచిత్ర ఎల్లా పేర్కొన్నారు. బర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజేశ్వరిని వారు శనివారం పరామర్శించారు. వారు మాట్లాడుతూ బర్డ్ ఆస్పత్రిలో డీఈవో(డేటా ఎంట్రీ ఆపరేటర్)గా టీటీడీ సొసైటీ కింద పనిచేస్తున్న రాజేశ్వరి విష్ణు నివాసం వద్ద కేటాయించిన విధులు ముగించుకొని బయటకు వస్తున్న క్రమంలో అక్కడ జరుగుతున్న తొక్కిసలాటలో గాయపడిన బాధితులను తీసుకువెళ్లేందుకు వచ్చిన అంబులెన్సు ఢీకొని తీవ్రంగా గాయపడటం బాధాకరమన్నారు. ప్రస్తుతం విరిగిన ఆమె కాలుకి ఆపరేషన్ చేసినా కోలుకోవడానికి సమయం పడుతుందన్నారు. టీటీడీ తరపున నష్టపరిహారం అందించేందుకు కృషిచేస్తామని రాజేశ్వరి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

మట్టి వాసన గుబాళించే మౌని కవిత్వం

- తొలకరి చినుకులు పుస్తకావిష్కరణలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహిత్య ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 11(ఆంధ్రజ్యోతి): మట్టి వాసన తెలిసిన కవి మౌని అని పలువురు వక్తలు అన్నారు. కవి మౌని రాసిన తొలకరి చినుకులు పుస్తకావిష్కరణ సభ తిరుపతిలోని యూత్ హాస్టల్లో శనివారం నిర్వహించారు. ఇందులో సప్తగిరి మాజీ సంపాదకులు శైలకుమార్, విశ్వశ్రీ సాహిత్య సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, ఈతరం కవితా వేదిక అధ్యక్షులు తోట వెంటేశ్వర్లు తదితరులు పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ఆయువుపట్టు తెలిసిన కవి మౌని అని అభిప్రాయపడ్డారు. నగర ప్రముఖులు టెంకాయల దామోదరం, పుస్తక రచయిత మౌని, కవులు నెమిలేటి కిట్టన్న, ఆర్‌సీ కృష్ణస్వామిరాజు, చెన్నకేశవులు నాయుడు, మల్లారపు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆప్కోలో 30శాతం రాయితీ

తిరుపతి అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని ఆప్కో అన్ని రకాల వస్త్రాలపై 30శాతం రాయితీ అవకాశం కల్పించినట్లు స్థానిక ఆప్కో వాణిజ్య అధికారి ఎస్.కోటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీరోడ్డు, శ్రీనివాసం, తిరుమలలో ఉన్న ఆప్కో వస్త్ర దుకాణాలలో మంగళగిరి, బందరు, రాజమండ్రి, ఉప్పాడ, వెంకటగిరి, మాధవరం, కాటన్, పట్టు చీరలు, డ్రస్ మెటీరియల్స్ రెడీమేడ్ షర్టులు తదితర వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జూనియర్ మిస్టర్ ఇండియా పోటీలకు తిరుపతి క్రీడాకారులు



జ్యోతి ప్రజ్వలనచేసి పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ ఇండోర్‌సిటీ లేక్‌వ్యూగార్డెన్‌లో గోల్డెన్ ఇండియా బాడీబిల్డింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూనియర్ మిస్టర్ ఇండియా పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా పదిమంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా, అందులో ఇద్దరు తిరుపతికి చెందిన లీలాసాగర్ (55వెయిట్‌గ్రూప్), వెంకటేశ్వర్లు (60వెయిట్‌గ్రూప్) ఉన్నారు. గ్రూప్‌దశ పోటీల్లో తలపడి రాణించారు. తుదిపోరు ఆదివారం జరుగనుంది. గోల్డెన్ ఇండియా బాడీబిల్డింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ప్రధాన కార్యదర్శి వి.జి.బాబు, మోహన్‌సింగ్ రాథోడ్, సంతోష్‌సింగ్ చోప్రా, ధూపేంద్రసింగ్ సోలంకి, రితిష్ వీరాంగ్, శివశంకర్ ఠాకూర్, చంద్రబాన్‌సింగ్ సోలంకి, యుగేందర్, ఏపీ ప్రతినిధులు ఎస్వీ శివప్రసాద్, జి.శ్రీహరి, టి.ఎ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వాకా వెంకటాచలపతి మృతి పట్ల సంతాపం




వాకా వెంకటాచలపతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీలో వుంటోన్న రిటైర్డు అకౌంట్స్ ఆఫీసర్ వాకా వెంకటాచలపతి (91) వయోభారంతో శనివారం రాత్రి కన్నుమూశారు. వీరికి సతీమణి, నలుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. వీరిలో ఒకరైన వాకా ప్రసాద్ తిరుపతి పౌర చైతన్య వేదిక అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. వాకా వెంకటాచలపతి అంత్యక్రియలు ఆదివారం ఉదయం 11.30 గంటలకు గోవిందధామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటాచలపతి మృతి పట్ల తిరుపతి పౌర చైతన్య వేదిక గౌరవాధ్యక్షులు రాఘవ, కార్యదర్శి పరమేశ్వరరావు, తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్, అరసం జిల్లా అధ్యక్షులు యువశ్రీ మురళి, తెలుగు భాషోద్యమ సమితి ప్రతినిధులు పేరూరు బాలసుబ్రమణ్యం, గజేంద్ర, చలపతి తదితరులు సంతాపం తెలిపారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

తిరుపతి మంగళం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి రేంజ్ అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ బృందం శనివారం తిరుపతి రేంజ్‌లోని ఫారెస్టు బీటు పరిధిలో కూంబింగ్ చేపట్టారు. తెల్లవారు జామున ముగ్గురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకొస్తూ టాస్క్‌ఫోర్స్ కంటపడ్డారు. చుట్టుముట్టగా దుంగలను పడేసి పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి ముగ్గురిని అదుపులోకి తీసుకుని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు తమిళనాడుకు చెందినవారుగా గుర్తించి, టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీనివాసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రుల మనోభావాలను దెబ్బతీశారు: చింతా



మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల మనోభావాలను ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దెబ్బతీశారని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ధ్వజమెత్తారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖలో పాల్గొన్న సభలో విశాఖ ఉక్కును అమ్మేది లేదని ఒక్క మాటైనా చెప్పి ఉంటే బాగుండేదన్నారు. రెండు సంవత్సరాలుగా విశాఖ ఉక్కుపరిశ్రమ ప్రైవేటు పరం కాకుండా కార్మికులు పోరాడుతున్నారన్నారు. వీటిపై మోదీని చంద్రబాబు అడిగి ఉంటే బాగుండేదని తెలిపారు. వైకుంఠ ద్వారా దర్శన టిక్కెట్ల జారీలో జరిగిన తొక్కిసలాటకు టీటీడీ, పోలీసు అధికారుల సమన్వయ లోపమే కారణమన్నారు. తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు శాశ్వత ఉద్యోగం కల్పించాలన్నారు. యార్లపల్లి గోపి, రవి, తేజోవతి, మునిశోభ, రావణ్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రెండవ రోజూ ప్రశాంతంగా..

- రెండు మూడు గంటల్లోనే వైకుంఠ ద్వార దర్శనం
- పలుచగా భక్తజనం
- శాస్త్రోక్తంగా చక్రస్నానం


ఆలయం ముందు పలుచగా భక్తుల రద్దీ

తిరుమల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వాదశి రోజైన శనివారం ఉత్తర ద్వార దర్శనాలు ప్రశాంతంగా ముగిశాయి. భక్తులు రెండుమూడు గంటల్లోనే శ్రీవారిని దర్శించుకోవడంతో పాటు ఉత్తర ద్వార ప్రవేశం చేశారు. శుక్రవారం వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు 60,094 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్, కంపార్టుమెంట్లలో అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, టీ, కాఫీ అందజేశారు. విజిలెన్స్, పోలీసులు, ఆలయ సిబ్బంది సమన్వయంతో క్యూలైన్లను సమర్థవంతంగా నిర్వహించారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం : వైకుంఠ ద్వాదశి సందర్భంగా శనివారం ఉదయం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ముందుగా సుదర్శన చక్రత్తాళ్వారును శ్రీవారి ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చారు. శ్రీవారి పుష్కరిణిలో వేకువజాము స్నపన తిరుమంజనం, శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. టీటీడీ ఈవో శ్యామలరావు, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.

పలుచగానే భక్తుల రద్దీ : ఏటా వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో భక్తులతో కిటకిటలాడే తిరుమల క్షేత్రం ఈసారి ఏకాదశి రోజు నుంచే బోసిపోయింది. ఆన్‌లైన్‌లో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి టికెట్లతో పాటు తిరుపతిలో జారీ చేసే స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్‌ఎస్‌డీ) టోకెన్లు ఉన్న భక్తులకే శ్రీవారి దర్శనం ఉంటుందని టీటీడీ ప్రకటన చేయడంతో భక్తులు టోకెన్లు పొందేందుకు తిరుపతికి వచ్చారు. అయితే టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడంతో చాలామంది వెళ్లిపోయారు. ముందుగా ప్లాన్ చేసుకున్న భక్తులు వాయిదా వేసుకుంటున్నట్టు సమాచారం. సీఎం, డిప్యూటీ సీఎం, మాజీ సీఎంల పర్యటన నేపథ్యంలో రాజకీయ ప్రముఖులు కూడా వాయిదా వేసుకున్నారు. గదులు కేటాయించే కౌంటర్లు, లడ్డూ కేంద్రం, తలనీలాలు సమర్పించే కల్యాణ కట్టల్లోనూ భక్తులు పలుచగా ఉన్నారు. లగేజీ కౌంటర్లు ఖాళీగా కనిపించాయి.


చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

సేవాపథాన యువోత్సాహం

'కెరటం నాకు ఆదర్శం... పడుతున్నా మళ్లీ లేస్తున్నందుకు..' యువతకు మార్గనిర్దేశకుడిగా నిలిచిన స్వామి వివేకానందుడు చెప్పిన మాటలివి. రోజుకు ఒక్కసారైనా మీతో మీరు మాట్లాడుకోండి.. లేకపోతే ఓ అద్భుతమైన వ్యక్తితో మాట్లాడే అవకాశాన్ని మిస్సవుతారంటూ ఆ మహనీయుడు తరతరాలకీ తరగని స్ఫూర్తిదాయకమైన మాటలెన్నో చెప్పారు. యువతరానికి ఆయన హితవచనాలు సన్మార్గాన్ని చూపుతాయి. బంగారు భవితకు బాటలు వేస్తాయి. అందుకే వివేకానందుడి జయంతిని జాతీయ యువజనోత్సవంగా జరుపుకొంటున్నాం. ఆ మహనుభావుని మాటలతో స్ఫూర్తి పొంది ఉన్నత సమాజ నిర్మాణంలో తామూ భాగస్వాములు కావాలనే బలమైన సంకల్పంతో పనిచేస్తున్న ఈ ఇద్దరూ ఏమంటున్నారో తెలుసుకుందాం.

- గూడూరు అర్బన్ / తడ (ఆంధ్రజ్యోతి)

లేవండి..మేల్కోండి..
గమ్యం చేరేవరకూ విశ్రమించకండి
హృదయానికి, మెదడుకూ సంఘర్షణ తలెత్తితే
హృదయాన్నే అనుసరించండి
- స్వామి వివేకానంద



నేడు వివేకానంద జయంతి

వివేకామాట.. చూపింది బాట..



మాది రాజస్థాన్‌లోని కోట జిల్లా ముంగేనా గ్రామం. 12వ తరగతి వరకు ఇటావాలోనే విద్యాభ్యాసం గడిచింది. 2017లో భోపాల్‌లోని ఎన్‌ఐటీలో బీటెక్ చేశాను. రిలయన్స్ ఇండియా లిమిటెడ్‌లో మంచి జీతంతో ఉద్యోగం వచ్చింది.నా లక్ష్యానికి అది సరికాదనిపించింది. ప్రజలతో మమేకమై సేవ చేయలనే లక్ష్యం ఉండేది. ఈ కారణంతోనే కొన్నాళ్ల ఆ ఉద్యోగం చేసి వదిలేశాను. ఢిల్లీ వెళ్లి సివిల్ సర్వీసెస్ కోచింగ్‌లో చేరాను. మొదటి ప్రయత్నంలో స్టేట్ సివిల్ సర్వీస్‌కు ఎంపికయ్యాను. కానీ నాకు అది తృప్తినివ్వలేదు. అప్పుడే వివేకానందుడి స్ఫూర్తి మాటలు గుర్తుకొచ్చేవి.నాలో ఉత్సాహాన్ని రగిలించేవి.2021లో రెండవసారి ప్రయత్నించాను. 588 ర్యాంకుతో ఐపీఎస్ వచ్చింది. హైదరాబాద్‌లో శిక్షణకు జాయిన్ అయ్యాను. పోలీసుశాఖకే పరిమితం కావాలంటే మనసు అంగీకరించలేదు. వైద్యం, ఆరోగ్యం, విద్య తదితర రంగాల ద్వారా సేవచేయాలనే ఆకాంక్షకు దూరమయ్యానన్న బాధ వెంటాడేది. ఐపీఎస్ శిక్షణ పొందుతూనే మూడవసారి సివిల్స్ రాశాను. ఈ ప్రయత్నం ఫలించింది. 343 ర్యాంకుతో ఐఏఎస్‌కు సెలెక్టయ్యాను. ఈ మూడు ప్రయత్నాల్లో నా సంకల్పానికి నాన్న, అమ్మ, తమ్ముడు, స్నేహితులు అండగా నిలిచారు. కెరీర్‌లో నేను అనుకున్న లక్ష్యాన్ని ఛేదించడంలో వివేకానందుడి మాటలు ఎంతగానో ప్రేరణగా నిలిచాయి. ఆయన తత్వం నా కెరీర్‌లో ప్రతి మెట్టునూ ప్రభావితం చేసింది. ఇప్పటివరకు సమాజం నాకు చాలా ఇచ్చింది. ఇప్పుడు సమాజానికి ఎంతో చేయాలనుంది. 'లేవండి.. మేల్కోండి... గమ్యం చేరే వరకు విశ్రమించకండి. లక్ష్యంపై ఉన్న శ్రద్ధ, ఆసక్తి లక్ష్యసాధనలో సైతం చూపించాలి.. అన్న మహనీయుడు వివేకానంద స్ఫూర్తిని నేటితరం మరువకూడదంటాను.

- రాఘవేంద్ర మీనా, ఐఎఎస్,
గూడూరు సబ్‌కలెక్టర్

యువత రాజకీయాల్లోకి రావాలి



మాది నాయుడుపేట మండలం భీమవరం సొంతూరు. మా నాన్న సుబ్రహ్మణ్యం ఎంపీగా పనిచేశారు. రాజకీయాల్లో అడుగుపెట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పం నాలో రగిలించారు. ఇదే సమయంలో వివేకానందుడి మాటలు నన్ను ఎంతగానో ప్రభావితురాలిని చేశాయి. ఆయన బ్యాంక్ అధికారిగా పనిచేసినా తరువాత రాజకీయాల్లోకి వచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పడేవారు. నాకు చిన్నప్పటి నుంచి హాస్టల్‌లో ఉండి చదువుకోవడం అలవాటైపోయింది. చదువుతో ఉన్నత స్థాయికి చేరి ప్రజలకు సహాయపడవచ్చని అమ్మానాన్నా చెప్పేవారు. ఆ మాటలు ప్రభావితం చేశాయి.ఎంబీబీఎస్ చదువుతున్నప్పుడు ఐదేళ్లు పుస్తకాలే ప్రపంచంగా బతికాను. గత ఏడాది పీజీ ఎంట్రన్స్‌కు ప్రిపేరవుతున్న దశలో అనూహ్యంగా రాజకీయాలవైపు వచ్చాను.ఆ సమయంలో చంద్రబాబునాయుడి పోరాటపటిమ, మనోనిబ్బరం నాలో స్ఫూర్తిని నింపాయి. గతేడాది ఎన్నికల్లో టీడీపీ పక్షాన పోటీ చేశాను. ఎమ్మెల్యేనయ్యాను. డాక్టర్ అంటే కొంతమందికే సేవచేసే అవకాశం ఉంటుంది. రాజకీయాల్లో అన్ని రంగాల వారికీ సేవచేసే వీలుంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో యువత రాజకీయాల్లోకి రావాలి. మెరుగైన సమాజ నిర్మాణానికి నడుం బిగించాలి. ప్రజలకు సేవచేసే అవకాశాన్ని యువతరం దూరం చేసుకోకూడదని అభిప్రాయపడుతున్నాను. ప్రతి సందర్భంలోనూ యువతరాన్ని ఉత్తేజితులను చేసి ముందుకు నడిపే వివేకానందుడి మాటలను తరచూ గుర్తు చేసుకుంటాను.

- నెలవల విజయశ్రీ, ఎమ్మెల్యే,
సూళ్లూరుపేట

ఘనంగా ట్రిపుల్ ఐటీ - శ్రీసిటీ స్నాతకోత్సవం

- 298 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం



శ్రీసిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐఐఐటీ - శ్రీసిటీ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 298 మంది విద్యార్థులకు ఐఐఐటీ - శ్రీసిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వీ.కార్తికేయన్ పట్టాలను ప్రదానం చేశారు. ఐఐఐటీ-శ్రీసిటీ ఛైర్‌పర్సన్, జోహో కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, సీఈవో డాక్టర్ శ్రీధర్ వెంబు వర్చువల్‌గా సమావేశానికి అధ్యక్షత వహించగా, ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ముఖ్య అతిథిగా ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, క్యాటర్ పిల్లర్ టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్ భువన్ ఆనంద్‌క్రిష్ణన్, ఎడబ్ల్యూఎస్ ఇండియా చీఫ్ టెక్నాలజిస్ట్ శాలినీ కపూర్ తదితర సెనేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కార్తికేయన్ 2023 - 2024 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను సమర్పించారు. డాక్టర్ శ్రీధర్ వెంబు పట్టభద్రుల విజయాలను అభినందిస్తూ విజ్ఞాన సముపార్జన దశనుంచి సమాజానికి, దేశానికి సేవచేసే స్థితికి ఎదగాలని సూచించారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ తన వర్చువల్ ప్రసంగంలో మనిషి విజయం సాధించాలంటే ఆసక్తి, నిబద్ధత, ప్రావీణ్యం, సంకల్పం, ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం వంటి ఆరు ముఖ్య లక్షణాలు అవసరమని వివరించారు. ఐఐఐటీ-శ్రీసిటీ, ఇస్రో మధ్య భవిష్యత్ సహకారాలు ఉండగలవన్న ఆశాభావం వ్యక్తం చేస్తూ ఒక ఉమ్మడి పరిశోధనా విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. స్నాతకోత్సవంలో ఐదుగురికి పీహెచ్‌డీ, ఇద్దరికి ఎంఎస్, మరో ఇద్దరికి ఎంటెక్, 298 మందికి బీటెక్ పట్టాలను ప్రదానం చేశారు. బీటెక్ విభాగంలో మోహన్ సాయికృష్ణ (కంప్యూటర్ సైన్స్), దాచర్ల శ్రీజ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్) బంగారు పతకాలను అందుకున్నారు.

బాధితులకు టీటీడీ సాయం

తిరుపతి(వైద్యం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ చేసే సమయంలో జరిగిన తొక్కిసలాటలో గాయపడి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ కోలుకున్న బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు శనివారం రాత్రి స్విమ్స్‌కు చేరుకుని చెక్కులను అందజేశారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నరసాపురానికి చెందిన ఎస్.తిమ్మక్క, విశాఖపట్నంకు చెందిన పి.ఈశ్వరమ్మలకు రూ.5 లక్షల చొప్పున, స్వల్ప గాయాలైన అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నరసాపురానికి చెందిన కె.నరసమ్మ, పి.రఘు, కె.గణేష్, పి.వెంకటేష్, చిన్నప్పయ్యలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు షాజహాన్, పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాష్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, కలెక్టరు వెంకటేశ్వర్, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, కార్పొరేటర్ మునికృష్ణ, టీడీపీ నేతలు శ్రీధర్‌వర్మ, మోహన్‌రావు పాల్గొన్నారు.


బాధితులకు చెక్కులను అందజేస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

- ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ
- కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు
- 11 మందికి కన్సొలేషన్ బహుమతులు
- బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ






ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ




ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత


కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి



పుత్తూరు వార్తలు

ప్రభుత్వ భూమి ధారాదత్తం..!

- ఇతరుల పేరిట గ్రామ, పాఠశాల స్థలం మ్యుటేషన్
- అప్పటి తహసీల్దార్ నిర్వాకంపై గ్రామస్తుల ఆందోళన



ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ చేసిన ప్రభుత్వ భూమి

వడమాలపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇంటిస్థలాలు, పాఠశాల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని యథేచ్ఛగా దారాదత్తం చేసిన తహసీల్దార్‌పై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వడమాలపేట మండలం ఎనమలపాలెం ఆది ఆంధ్రవాడలో నిరుపేదల కోసం 1975లో సర్వే నెంబర్ 195-3లో 5.12 ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా కొనుగోలు చేసింది. ఇళ్ల స్థలాలిచ్చి ఇంటి నిర్మాణాలు చేపట్టింది. అలాగే పాఠశాలకు స్థలం కేటాయించింది. అదేసమయంలో ఆ భూమిని విక్రయించిన వ్యక్తి మనవడు కోర్టును ఆశ్రయించడంతో వివాదం నెలకొంది. ఇదే అదనుగా ఇంకా మిగిలిన ఖాళీగా ఉన్న భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. అదే సమ యంలో ఎన్నికలు వచ్చాయి. తహసీల్దార్ రాజసింహ నరేంద్ర ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. అక్రమార్కులు తహసీల్దార్ ద్వారా ఖాళీగా ఉన్న సుమారు రూ.2కోట్ల విలువైన 1.15 ఎకరాల భూమిని దక్కించుకునేందుకు ఏకంగా అడంగల్‌నే మార్చారు. ఎలాంటి రికార్డులు లేకుండానే చెంగయ్య పేరు మీదుగా మ్యుటేషన్ ద్వారా అడంగల్‌లో మార్చి వేశారు. తర్వాత అదేభూమిని ఇతరులు పేరుమీదుగా రిజిస్టర్ కూడా చేసుకున్నారు. ఈ భూస్వాహాపై కమ్యూనిస్టు పార్టీ నాయకులు నిరసనలకు కూడా దిగారు. అయినా జిల్లా యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైన జిల్లా యంత్రాంగం స్పందించి విచారణ జరిపి గ్రామానికి చెందిన భూమిని రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధి కోసమే గోకులాలు

వడమాలపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధి కోసమే ఉమ్మడి ప్రభుత్వం గోకులాలలను ఏర్పాటు చేసి రైతాంగ అభివృద్ధి కోసం కృషి చేస్తోందని నగరి నియోజకవర్గం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. శనివారం మండలంలోని వసంతనగర్‌లో రూ.2.30 లక్షల వ్యయంతో నిర్మించిన మినీ గోకులం షెడ్‌ను ఆయన ప్రారంభించారు. ఎంపీడీవో శేషగిరి రావు, నాయకులు ధనంజయులు నాయుడు, వెంకటయ్య, వెంకటేశ్వరరావ్, ఆదినారాయణరాజు, సోము, శివశంకర్ వర్మ, శ్రవణ్ పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే కూటమి ధ్యేయం : ఎమ్మెల్యే



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తడుకు పంచాయితీ, ఎగువగూలూరు దళితవాడలో రూ.9 లక్షలతో సీసీ రోడ్లు, రూ.3 లక్షలతో నిర్మించిన మినీ గోకులాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎగువగూలూరులో ముగ్గులు పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ గంజీ మాధవయ్య, ఎంపీడీవో రమేష్ బాబు, టీడీపీ నాయకులు సర్పంచ్ బొబ్బలి యాదవ్, అమర్నాథ్, టీఎన్‌టీయూసీ కార్యదర్శి మోహన్‌కుమార్, కరుణాయాదవ్, గాలి గోపీనాథ్, మాజీ ఎంపీటీసీలు ఆది, శంకర్, కార్యదర్శి నరేష్, ఈవోపీఆర్‌డీ దేవిక, పంచాయితీ రాజ్ డీఈలు, ఏఈలు, విద్యుత్ శాఖ ఏఈ సాయి శీను పాల్గొన్నారు.

- తడుకు నుంచి శిరుగురాజపాలెం రింగురోడ్డును బాగుచేయించాలని నీట మునిగిన విద్యుత్ స్తంభాలను మార్పు చేయాలని గ్రామస్థుడైన నందయ్య వినతిపత్రం అందజేశారు.

కాజ్ వేకు తాత్కాలిక మరమ్మతులు

వడమాలపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వడమాలపేట వద్ద చీమలవారివంక కాజ్ వే కుంగడంతో నగరి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తాత్కలిక మరమ్మతులు చేపట్టారు. రెండు రోజులుగా ఆర్ అండ్ బీ అధికారులు పర్యవేక్షణలో మరమ్మతులు చేశారు. దీంతో శనివారం నుంచి వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. శాశ్వత బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామని ఆర్ అండ్ బీ డీఈ అమరనాథరెడ్డి చెప్పారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు



నారాయణవనంలో ఓ కూల్ డ్రింక్స్ దుకాణంలో మద్యం అమ్మకాలు

నారాయణవనం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలిశాయి. అధికారికంగా నారాయణవనంలో రెండు, పాలమంగళంలో ఒక మద్యం దుకాణం ఉంది. మద్యం దుకాణాదారులు విచ్చలవిడిగా బెల్టు షాపులను నిర్వహిస్తున్నారని సమాచారం. కొన్ని చోట్ల కూల్ డ్రింక్ దుకాణాలే అడ్డాగా చేసుకుని మద్యం విక్రయిస్తున్నారు. ఒక క్వార్టర్‌పై రూ.40 నుంచి 60 రూపాయలు అదనంగా అమ్మకాలు సాగుతున్నాయని మద్యం ప్రియులు వాపోతున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో తూగుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే మండల పరిధిలోని సింగిరికోన అటవీప్రాంతం కేంద్రంగా సారా తయారీ కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలిశాయంటూ ఎరికంబట్టు, తిరువట్యం, నాగిలేరు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఎట్టకేలకు కుక్కలు పట్టారు ..!



పుత్తూరు అర్బన్, జనవరి11(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో కుక్కలను పట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇటీవల పలువురు పిచ్చికుక్క కాటుకు గురైన సంగతి తెలిసిందే. మున్సిపల్ అధికారులు వారి పరిధిలో ఏదేని ప్రమాదాలు జరిగితే కానీ ఆ పనుల పట్ల దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో పద్మావతి నగర్ ఎక్స్‌టెన్సన్, ఎంఎస్ఎం నగర్ ఎక్స్‌టెన్సన్, ధర్మరాజుల గుడి ప్రాంతం, పల్లూరు సందులో కుక్కలను పట్టుకున్నారు. పట్టుబడిన కుక్కలను తిరుపతిలోని బ్లూ అనిమల్ కేర్‌కు తరలించారు. యానిమల్ బర్త్ కంట్రోల్ అండ్ యాంటీ రేబిస్‌కు టీకాలు వంటివి వేయనున్నారు. తిరిగి ఆ కుక్కలను పట్టుకున్న ప్రాంతాల్లో వదిలేయనున్నట్లు ఇన్‌ఛార్జ్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ మునస్వామి తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం



భానుప్రకాష్ మృతదేహం

వాకాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తూపిలిపాళెం సముద్రతీరంలో గురువారం గల్లంతైన విద్యార్థి ఇంగిలాల భానుప్రకాష్ (18) మృతదేహం శనివారం ఉదయం లభ్యమైంది. చిట్టమూరు మండలం మల్లాం సీవీ ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో చదువుతున్న 8 మంది విద్యార్థులు గురువారం వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో సముద్రస్నానానకి వెళ్లిన విషయం తెలిసిందే. ఈత కొడుతూ ఇద్దరు గల్లంతు కాగా, ఓ విద్యార్థి మామిడి లోకేష్ మృతదేహం శుక్రవారం సాయంత్రం ఒడ్డుకు చేరింది. మరో విద్యార్థి, చిట్టమూరు మండలం కొక్కుపాళెం గ్రామానికి చెందిన మస్తానయ్య కుమారుడు భాను ప్రకాష్ మృతదేహం శనివారం ఉదయం లభ్యమైంది. బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మానమాలలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం - ఓజిలి శిథిలావస్థకు చేరిన దృశ్యం

నిరుపయోగంగా సంపద కేంద్రాలు

ఓజిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పేరుతో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. మండలంలోని అన్ని పంచాయతీల్లో 20 షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ఒక్కోదానికి రూ.5.10 లక్షల నుంచి రూ.3.30 లక్షల వరకు వ్యయం చేశారు. కొన్నాళ్ల పాటు బాగానే సాగినా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి నిర్వహణ పట్టించుకోలేదు. గ్రామాల్లో చెత్త సేకరణ కూడా నిలిపివేశారు. దీంతో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారడంతో పాటు శిథిలావస్థకు చేరుకున్నారు. కొన్ని గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారగా, కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం లోనైనా సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తే గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు పంచాయతీలకు ఆదాయం చేకూరుతుంది. ఈ విషయమై ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల వివరాలను సేకరించి సిద్ధం చేశామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు నిధుల లభ్యతను దృష్టిలో వుంచుకుని ఆయా కేంద్రాల నిర్వహణ చేపడతామని చెప్పారు.

క్రీడల పట్ల యువత మక్కువ పెంచుకోవాలి: కురుగొండ్ల

దక్కిలి, జనవరి 11 : (ఆంధ్రజ్యోతి): క్రీడల పట్ల యువత మక్కువ పెంచుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం దక్కిలిలో దివంగత పిన్నక కొండయ్య, రత్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు జగదీష్ బాబు ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల చక్కటి నడవడిక, దేహదారుఢ్యం, మానసిక వికాసం వంటి ఎన్నో మంచి లక్షణాలు అలవడుతాయన్నారు. ప్రతి ఏడాదీ దక్కిలిలో జగదీష్ బాబు ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం మంచి సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, వైస్‌ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, వేముల నాగభూణం నాయుడు, మాధవాయపాళెం సర్పంచు మాధవరెడ్డి, నాయకులు దక్కిలి చంద్రారెడ్డి, రత్నాకరరెడ్డి, పెంచలరెడ్డి, చైతన్య, సర్వేపల్లి రత్నయ్య, జనసేన నాయకులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రాంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ఏటి పండుగలో సంక్రాంతి సంస్కృతిని అవలంబించాలి



నెలవలకు వినతిపత్రం ఇస్తున్న విశ్వహిందూపరిషత్ సభ్యులు

నాయుడుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఏటి పండుగ రోజుల్లో సంక్రాంతి సంస్కృతిని ప్రజలందరికీ తెలియజేసేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యానికి విశ్వహిందూ పరిషత్ సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. అలాగే మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపికకు కూడా వినతిపత్రం అందజేశారు. సంక్రాంతి సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు నేటి తరాలకు తెలియజేసేలా గోసంరక్షణ, బొమ్మల కొలువు వంటివి ఏర్పాటు చేయాలన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాయుడుపేట మండలం మేనకూరుకు చెందిన గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. మెకానికల్, ఎలక్ట్రికల్, ఐటీ, సీఎస్‌సీ, ఏఐడీఎస్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 46మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషన్‌దాస్, ఆయా విభాగాధిపతులు అభినందించారు.

కమనీయంగా గోదాదేవి కల్యాణం



కల్యాణానికి కొలువుదీరిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

సూళ్లూరుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి వేదపండితులు, మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణాన్ని తిలకించారు.

గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు



సత్యవేడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నేరి హౌసింగ్ కాలనీ సమీపంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రావెల్ తవ్వకాలను జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సుందరరామిరెడ్డి, టీడీపీ తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి లోకయ్యరెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సుందరరామిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గిరిజన కాలనీ సమీపంలో వైసీపీ పాలనలో అక్రమంగా అనుమతులు పొంది గ్రావెల్ క్వారీ నిర్వహించారని తెలిపారు. అప్పట్లో గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో కూడా తవ్వకాలు జరిపి గ్రావెల్‌ను అక్రమంగా తరలించుకున్నారని తెలిపారు. మళ్లీ ఇక్కడ గ్రావెల్ తవ్వకాలు జరిపితే గ్రామస్తులకు, ప్రత్యేకించి గిరిజనులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రావెల్ క్వారీలకు అనుమతులు రద్దుచేయాలని కోరారు. ఈ విషయమై ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఘనంగా బీదా రవిచంద్ర జన్మదిన వేడుకలు



శ్రీకాళహస్తి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బీసీ నాయకులు బీద రవిచంద్ర జన్మదిన వేడుకలను శనివారం రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ నాయకులు ఎంఎస్‌రెడ్డి, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జేబీఆర్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



పిచ్చాటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండల కేంద్రంలో కొలువైన ప్రముఖ విద్యాసంస్థ జేబీఆర్ పాఠశాలలో సంస్థల అధినేత జేబీఆర్ మునిరత్నం ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. స్కిట్‌లు, గేయాలు, నృత్యాలతో కోలాహల వాతావరణం నెలకొంది. భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ భూలక్ష్మి, ఏవో అంకయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి మడుగులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



శ్రీకాళహస్తి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బ్రేక్‌ఫెయిల్ కావడంతో ఆర్టీసీ బస్సు నీటిమడుగులోకి దూసుకెళ్లింది. ప్రయాణికులంతా క్షేమంగా బయటపడ్డారు. ఈ ఘటన తొట్టంబేడు మండలం బోనుపల్లి వద్ద శనివారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి బస్టాండు నుంచి 30 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బోనుపల్లికి బయలుదేరింది. బోనుపల్లి సమీపంలోని ఎస్టీకాలనీ వద్ద బ్రేక్‌ఫెయిల్ కావడంతో పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అటు తర్వాత నీటిమడుగులోకి దూసుకెళ్లింది. పక్కనే క్రికెట్ ఆడుతున్న కొందరు యువకులు ఘటనా స్థలానికి వెళ్లి ప్రయాణికులకు సహాయం అందజేశారు.

సీఆర్ రాజన్‌కు పలువురి శుభాకాంక్షలు

శ్రీకాళహస్తి/ పిచ్చాటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తిరుచానూరు సమీపం లోని ఆయన నివాసం వద్ద పార్లమెంటు తెలుగు రైతు ఉపాధ్యక్షులు తక్కలపాటి ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే సత్రవాడ ప్రవీణ్ కుమార్, గోగినేని భాస్కర్‌నాయుడు శని వారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మునిశేఖర్‌గౌడ్, జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

- పిచ్చాటూరుకు చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి సీ.ఆర్‌రాజన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పిచ్చాటూరు మండలానికిచెందిన అరణియార్ ఆయకట్టు సంఘం చైర్మన్ రవిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పద్దురాజు, జయచంద్ర నాయుడులతో కలసి ఇళంగోవన్‌రెడ్డి సీఆర్. రాజన్‌ను గజమాల వేసి సత్కరించారు.



సీఆర్‌రాజన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రకాష్‌నాయుడు, ఇళంగోవన్‌రెడ్డి తదితరులు

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అరెస్టు

కోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ షేక్ సర్దార్‌బాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏఎస్‌ఐ శోభారాణి శనివారం తెలిపారు. కోట పట్టణంలో ఈనెల 9న బైక్‌లో వెళ్తున్న రమణయ్యను వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో రమణయ్యకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌ను అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

బస్సుల్లేక ప్రయాణికుల ఇబ్బందులు

సూళ్లూరుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు సొంతూరికి వెళ్లేందుకు బస్సుల్లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూళ్లూరుపేట, తడ ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల్లో నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాలవారు ఎక్కువగా పనిచేస్తున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు వరుస సెలవులు ఇవ్వడంతో కార్మికులు వారి స్వగ్రామాలకు బయలుదేరారు. రాత్రి 8 గంటల వరకు కూడా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. సూళ్లూరుపేట నుంచి నెల్లూరు వైపు వెళ్లేందుకు మధ్యాహ్నం నుంచి బస్సులు లేవని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో రద్దీ ఉంటుందని తెలిసినా ఆర్టీసీ అధికారులు తగిన ఏర్పాట్లు చేయలేదని ప్రయాణికులు మండిపడ్డారు.

9 బైక్‌ల స్వాధీనం: ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్ల వద్ద అర్బన్ సీఐ బాబి

నాయుడుపేట టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సుమారు రూ.18 లక్షల విలువ చేసే 9 బైక్‌లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు నాయుడుపేట అర్బన్ సీఐ బాబి తెలిపారు. శనివారం నాయుడుపేట పోలీస్ స్టేషన్‌లో మీడియాతకు వివరాలు వెల్లడించారు. నాయుడుపేట - బిరదవాడ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్న నాయుడుపేటకు చెందిన షేక్ షమీఉల్లా, గుమ్మిడిపూడికి చెందిన కె.అర్జున్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా వారిరువురు 9 బైక్‌లు చోరీ చేసినట్లు వెల్లడించారు. దీంతో వారి వద్ద నుంచి 9 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు బాబి తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన అర్బన్ సీఐ బాబి, హెడ్ కానిస్టేబుల్ నాగూరయ్య, కానిస్టేబుళ్ల పోలయ్య, సాహెల్, దయాకర్, భానుతేజ, మస్తానయ్యను డీఎస్పీ చెంచుబాబు ప్రత్యేకంగా అభినందించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీలక్ష్మమ్మకాలనీ, చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, వంజివాక, గోవిందపల్లి గ్రామాల్లో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లోని స్వామివారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. కోట శ్రీలక్ష్మమ్మకాలనీలో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు సాయిబాబా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం జరిగింది.


కుటుంబ కలహాలకు
ఇద్దరు చిన్నారుల బలి

- పిల్లలతో కలసి బావిలో దూకిన తల్లి
- తల్లిన కాపాడగలిగిన గ్రామస్తులు
- అప్పటికే పిల్లలిద్దరూ మృత్యువాత





నగరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలకు ఇద్దరు చిన్నారుల జీవితాలు బలైపోయాయి. ఆవేశంలో పిల్లల కన్నతల్లి తీసుకున్న నిర్ణయం రెండు కుటుంబాల్లో శాశ్వత విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం మేరకు... నగరి మున్సిపాలిటీ పరిధిలోని భీమానగర్‌కు చెందిన దేవి (33)కి, చెన్నైలోని వెస్ట్ మాంబళానికి చెందిన ధనంజయులుతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఐశ్వర్య (10), అక్షర (3) అనే ఇద్దరు అమ్మాయిలు పుట్టారు. కుటుంబ కలహాల కారణంగా గురువారం దేవి నగరిలోని పుట్టింటికి వచ్చేసింది. శుక్రవారం ఏకాంబరకుప్పం సమీపంలో వున్న సాత్వపట్టెడలోని పెదనాన్న ఇంటికి వెళ్లి వస్తానని దేవి ఇద్దరు పిల్లలను తీసుకువెళ్లింది. అయితే ఆమె తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు సాత్వపట్టెడలోని బంధువులను విచారించారు. జాడ తెలియకపోవడంతో పోలీసులకు శనివారం ఉదయం ఫిర్యాదు చేశారు. సాయంత్రం సాత్వపట్టెడ సమీపంలోని పొలాల నుంచి ఆవులు తోలుకు వస్తున్న వ్యక్తులకు అక్కడున్న బావినుంచి శబ్దాలు వినిపించాయి. బావి దగ్గరకు వెళ్లి చూడగా తాడుపట్టుకొని వేలాడుతున్న దేవి కన్పించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అందరూ కలసి ఆమెను పైకిలాగి ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు చిన్నారుల మృతదేహాలను బావి నుంచి రాత్రి బయటకు తీశారు. నగరి సీఐ మహేశ్వర్ నేతృత్వంలో పోలీసులు విచారణ చేపట్టారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవి

సీఎం పర్యటనపై కలెక్టర్ సమీక్ష



రేణిగుంట, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి) : తిరుపతి జిల్లాలో ముఖ్య మంత్రి చంద్రబాబు పర్యటనపై కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠతో కలిసి వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్షించారు. స్థానిక విమానాశ్రయం లో జరిగిన ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ఎస్పీ మాట్లాడుతూ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా మనోన్మణి పుర ఉత్సవం



శ్రీకాళహస్తి. జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరా లయంలో శనివారం ఆగమోక్తంగా మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవం జరిగింది. అందులో భాగంగా శనివారం ఆలయ అలంకార మండపంలో అమ్మవారికి పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్టింపజేశారు. పురవీధుల్లో ఊరేగుతున్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

డీపీటీవోకు సన్మానం

శ్రీకాళహస్తి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి డీపీటీవోగా బాధ్యతలు చేపట్టిన నరసింహులను శనివారం ఆర్టీసీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. ట్రాఫిక్, గ్యారేజ్‌ను సందర్శించి సలహాలు, సూచనలు ఇచ్చారు. బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల, ఉద్యోగుల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ చక్రవరి, అసిస్టెంట్ మేనేజరు చిట్టెమ్మ, యూనియన్ పాల్గొన్నారు.

ఎంపీ ఆర్.కృష్ణయ్యను కలిసిన గుత్తి త్యాగరాజు



అర్.కృష్ణయ్య, లంక దినకర్‌ను సన్మానిస్తున్న త్యాగరాజు

వరదయ్యపాళెం, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్యను, 20 సూత్రాల కార్యక్రమ అమలు ఛైర్మన్ లంక దినకర్‌ను ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కన్వీనర్ గుత్తి త్యాగరాజు శనివారం తిరుపతిలో మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. దుశ్శాలువాతో సత్క రించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జల్లి మధుసూదన్, బీడీ బాలాజీ, నరేష్, రాజేంద్రశెట్టి, సునీల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వైభవంగా శని త్రయోదశి పూజలు

నాగలాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వ రాలయంలో శనివారం శనిత్రయోదశి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ ఆలయంలోని పరివార దేవతామూర్తులకు అభిషేకాలు చేసి విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం వివిధ పుష్పాలతో పుష్పాలంకరణ చేపట్టి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. నందీశ్వరునికి నక్షత్ర హారతి, కుంభ హారతి, మహా హారతులు చేపట్టారు. భక్తులు ఓం నమశ్శివాయ అంటూ శివనామ స్మరణలతో ఆలయాన్ని మార్మోగించారు. ఈ ప్రదోష పూజల్లో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డిలు పాల్గొన్నారు. ఈ పూజలను ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు,

టైలరింగ్ యంత్రాల వితరణ

నారాయణవనం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బ్రాహ్మణ తాంగేల్ గ్రామంలో కల్వరి ప్రేమ గాస్పెల్ ట్రస్ట్ వారిచే శనివారం పది మంది మహిళలకు టైలరింగ్ యంత్రాలు వితరణ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు గోవిందస్వామి, మండల వైద్యాధికారి దర్శిత్ రాజ్, సర్పంచ్ గుణశేఖర్, గురుపాదం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

సత్యవేడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమాసరెడ్డికండ్రిగలో రూ.3.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ తరుణాక్షరెడ్డి, మాజీ ఎంపీపీ మస్తాన్, నాయకులు పరమశివం, అమాసరెడ్డి, షణ్ముగం, శశి, సురేంద్రరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం తైలాభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ద్వార దర్శనం



తిరుచ్చిపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న

నారాయణవనం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నారాయణ వనంలో కొలువైన కళ్యాణ వెంక టేశ్వర స్వామి ఆలయంలో ద్వాదశిని పురస్కరించుకుని శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ఉత్తర వాకిలి ప్రవేశం చేశారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మాజీ మంత్రి ఆర్కే రోజా, సత్యవేడు వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, అధికారులు, ప్రజా ప్రతి నిధులు స్వామిని దర్శించుకుని ఉత్తరద్వారం ప్రవేశం చేసి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. శనివారం ఉదయం 2 గంటలకు తిరుప్పావైతో స్వామివారిని మేల్కొలిపి, ధనుర్మాస పూజలు నిర్వహించారు. అనంతరం ద్వాదశి ప్రత్యేక తిరుమంజనం చేపట్టిన ఆలయంలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం జరిపించారు. 7 గంటలకు ఉభయనాంచారులతో తిరుచ్చి వాహ నంపై మాడవీధుల్లో స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. 8.40 గంటలకు ఆలయ ప్రాకారంలోని ఉత్తమ ముఖ ద్వారంలో ప్రవేశించి కొలువుదీరారు. అనంతరం భక్తులు మూల వర్లను దర్శించుకుని ఉత్తరముఖ ద్వారంలో ప్రవేశించారు. స్థానిక టీటీడీ ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సన్నిధివీధిలో మళ్లీ ఆక్రమణ



సన్నిధి వీధిలో మరుగుదొడ్ల వద్ద ఏర్పాటు చేసిన బంకు

శ్రీకాళహస్తి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాయలం వద్ద ఉన్న సన్నిధివీధిలో శనివారం బంకు ఏర్పాటుతో మళ్లీ ఆక్రమణ అంశం తెరమీదకు వచ్చింది. గత వైసీపీ పాలనలో ఆలయ పరిసరాల్లో ఆక్రమణలు విపరీతంగా పెరిగిపోయాయి. దాంతో సన్నిధి వీధిలో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. నెలరోజుల క్రితం ఈ సమస్య పరిష్కారం కోసం పురపాలక, పోలీసుశాఖ అధికారులు సంయుక్తంగా సన్నిధివీధిలో జలవినాయకుని ఆలయం నుంచి టూరిస్టు బస్టాండు వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించారు. దీంతో ఇటీవల కొంతమేర సన్నిధివీధిలో ట్రాఫిక్ సమస్య అదుపులోకి వచ్చింది. సన్నిధి వీధి జలవినాయకుని సమీపంలో ఇటీవల ముక్కంటి ఆలయం తరుపున ఉచిత మరుగుదొడ్లను ప్రారంభించారు. శనివారం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సరిగ్గా రద్దీ ప్రాంతమైన మరుగుదొడ్ల వద్ద అనుమతి లేకుండా బంకును ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలను ఆదిలోనే అరికట్టాలని కోరుతున్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

తిరుపతి(ఆటోనగర్), జనవరి 11 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సంస్థలో పని చేస్తున్న బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య వెల్లడించారు. తిరుచానూరు సమీపంలో శనివారం ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో రాష్ట్ర మహాసభలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పదోన్నతులు, బకాయిలు చెల్లించే అంశాలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ సంస్థలో ఉన్న ఖాళీలు భర్తీ చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ట్రాన్స్‌కో, డిస్కంల సీఎండీలను కలసి చర్చించి సమస్యల పరిష్కరిస్తానని వెల్లడించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. అనంతరం విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ, కాలమాన పట్టికను ఆవిష్కరించారు. రాష్ట్ర నాయకులు జీకే వీరభద్రయ్య, ఎం.రామకృష్ణ, ఎం.శ్రీధర్, జి.చిన్నబాబు, పి.వి.మురళీమోహన్, ఎల్.చలపతి, కె.గంగాధర్‌రావు, ఎస్.రామకృష్ణ, జె.రామారావు, జి.విశ్వరూపాచారి, ఎం.పూర్ణచంద్రరావు, జె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సంక్రాంతికి వీధిలైట్ల ఏర్పాటు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంపాళెం పంచాయతీలో సంక్రాంతి పండుగకు వీధిలైట్లను సర్పంచ్ మాచాలమ్మ శనివారం ఏర్పాటు చేశారు. మూడు నెలలుగా వీధిలైట్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో సర్పంచ్ స్పందించారు. పంచాయతీలోని చలంవారి గిరిజనకాలనీ, కాంపాళెం గిరిజనకాలనీ, దళితవాడలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నిమోనియాపై అవగాహన

రేణిగుంట, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాలుగో సచివాలయ కేంద్రంలో నిమోనియా వ్యాధిపై పొదుపు సంఘాల సభ్యులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాస్ మీడియా అధికారి కిరణ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ కామ రాజులు మాట్లాడుతూ నిమోనియా వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సంఘ మిత్రలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సీసీరోడ్లుగా గ్రామీణ రోడ్లు



కేవీబీపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మండలంలో గ్రామీణ రోడ్లకు మోక్షం లభించింది. మండలానికి గ్రామీణ రోడ్ల నిమిత్తం రూ.2కోట్లు మంజూరైంది. అధ్వానంగా ఉన్న రోడ్లను గుర్తించి సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టారు. మిద్దికండ్రిగలో సీసీ రోడ్డు పనులు శనివారం పూర్తయ్యాయి.

మాజీ సర్పంచ్‌కు నివాళి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు ప్రసాద్(64) టీడీపీకి తీరని లోటని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. మాజీ సర్పంచ్ అనారోగ్యంతో శనివారం మృతి చెందడంతో ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, సర్పంచ్ రామమూర్తి, నాయకులు మునిచంద్ర నాయుడు, చెంచురామనాయుడు, సుబ్రమ్మణ్యం, రాజేంద్ర, వీరరాఘవులు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

సిపాయి భరోసా అందజేత

ఏర్పేడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పాతవీరాపురంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన మధురాంతకం పండమ్మ కుటుంబానికి సిపాయి భరోసా కింద ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం నిత్యావసర సరుకులను అందజేశారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్, మాజీ జడ్పీటీసీ మునిరంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, వైసీపీ నాయకులు గురవారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, జానకమ్మ, జంగారెడ్డి పాల్గొన్నారు.

ఊరందూరుకు సింగనమల ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఊరందూరు లోని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయ నను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. బొజ్జల బృందమ్మ బండారు శ్రావణిని ఆశీర్వదించారు. అనంతరం ఆమె శ్రీకాళహస్తీశ్వరస్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే నివాళి

వరదయ్యపాళెం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం కడూరు పంచాయతీ వెంకటరెడ్డి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బాలాజీనాయుడు(55) గత వారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం అక్కడికి చేరుకుని బాలాజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, దశరథన్, నరసరాజు, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కోడిపందేలు, జూదాలపై ప్రత్యేక నిఘా

వరదయ్యపాళెం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో కోడి పందేలు, జూదాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జూదం నేరమని పేర్కొన్నారు. సంక్రాంతిని ప్రశాంతంగా జరుపుకోవాలని జూదాలు ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఏర్పేడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఆరోగ్యం సాధ్యమని ఎస్‌వోఎస్ తిరుపతి లోకల్ ఇన్‌చార్జి సత్యనారాయణ అన్నారు. ఏర్పేడు మండలంలోని పల్లం పంచాయతీలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న 95 మంది పిల్లలకు ఎస్‌వోఎస్ బాలల గ్రామం ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. పిల్లలు, వారి తల్లిదండ్రులు, ఎస్‌వోఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి



ఓబన్న జయంతి వేడుకల్లో కేక్‌ను కట్ చేస్తున్న దృశ్యం

రేణిగుంట, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్నకు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని శ్రీకాళహస్తి రోడ్డులో ఓబన్న జయంతి వేడుకలను శనివారం వడ్డెర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవల రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనవరి 11వ తేదీన ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు మహబూబ్‌బాషా, మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ, వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధే ధ్యేయం



సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో సిమెంటు రోడ్లతో పాటు వారిని అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని సత్య వేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలంలోని కాటూరు పంచాయతీలోని పద్మావతిపురంలో రూ.10లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. వెస్ట్‌వరత్తూరు గ్రామంలోని గోకుల షెడ్‌ను శనివారం ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తివిక్రమరావు, ఎంఈవో రవీంద్రనాథ్, నాయకులు మునిచంద్రనాయుడు, కార్తీక్‌నాయుడు, భూపయ్య, రామనాథం, శశియాదవ్, సర్పంచ్ చిరంజీవి, పరశురామ్, మునెయ్యనాయుడు, రవినాయుడు, ఏపీవో భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

మినీస్టేడియానికి మరమ్మతులు పూర్తి



మినీస్టేడియంను శుభ్రం చేస్తున్న కార్మికులు

శ్రీకాళహస్తి, జనవరి11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని మినీ స్టేడియానికి మరమ్మతులు పూర్తయ్యాయి. పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో మినీస్టేడియం పర్యవేక్షణ లేక గత వైసీపీ పాలనలో అధ్వానంగా తయారైంది. కిటికీలు, తలుపులు ఇతర పరికరాలు ధ్వంసం కావడంతో పాటు ఈ ప్రాంగణం మందుబాబులకు అడ్డాగా మారింది. ఇటీవల శాప్‌ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రవినాయుడు మినీస్టేడియంను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు మరమ్మతులను చేపట్టారు. ప్రస్తుతం పనులు తుదిదశలో కొనసాగుతున్నట్లు రవినాయుడు తెలిపారు.

బాబు కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



సత్యవేడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు బాబు జూనియర్ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డీ.పరంధామ్ విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో భోగి మంటలు వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్, పళణి, ప్రసన్నకుమార్, ఈశ్వర్, ఐలు, అపర్ణ, భానుప్రియ, సూర్య, దీప, ప్రియాంక, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్ పాడి రైతులకు ఎంతో మేలు



మినీ గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మినీ గోకులం షెడ్ పాడి రైతులకు ఎంతో మేలు అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. చిన్నసింగమాలలో నిర్మించిన గోకులం షెడ్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారం భించారు. అనంతరం ఆయన పలువురు సీనియర్ నాయకులను, కార్య కర్తలను ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆటస్థలాన్ని బాగు చేయాలని యువత ఎమ్మెల్యేను కోరారు. మైదానాన్ని బాగుచేసి ప్రహరీ నిర్మించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.